సాక్షి
కుమురం భీం
బుధవారం । 5 । జూలై । 2023



బడికి నిధులు..!

బడుల నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేసింది. స్కూల్ గ్రాంటు నిధులతో పాటు స్పోర్ట్స్ గ్రాంటు నిధులు కూడా విడుదలయ్యాయి. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సజీవన్ తెలిపారు. 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో 38 సీట్లు, ఐదో తరగతిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 15లోగా జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
32.5 /25.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించే సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లో కమిషన్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. రజిని, శ్రీదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన ఎమ్మెల్యే సక్కు



పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సక్కు, తదితరులు

నార్నూర్(ఆసిఫాబాద్): ఐటీడీఏ నూతన పీవోగా నియమితులైన చాహత్ బాజ్‌పాయ్‌ని ఉట్నూర్‌లోని కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవగాహన కలిగిన అధికారులతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ మోతుబాయి, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, నాయకులు దేవ్‌రావు, కనక కొద్దు, ప్రభాకర్, మానిక్‌రావు తదితరులు ఉన్నారు.


రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు భావన, అక్షిత ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన పూజ, అంజలి రెండో స్థానంలో నిలిచారని డీఈవో అశోక్ వెల్లడించారు. లీడ్ బ్యాంక్ జిల్లా అధికారి అలీబాబా, మేనేజర్ హనుమంతు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీలు తదితరులు ఉన్నారు.

పాము కాటుతో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

బెజ్జూర్: పాముకాటుతో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం బెజ్జూర్ మండలంలోని రెబ్బెన గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన తొర్రెం సాన్విక (5) రెబ్బెనలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆరుబయట ఆడుకుంటుండగా చిన్నారిని పాము కాటు వేసింది. చిన్నారి కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

స్టేషన్‌లోనే స్కెచ్‌ప్లే!?

- వ్యాపారులతో అక్కడే సమావేశం
- సీఎం పర్యటన ఖర్చులపై మాటామంతి
- సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు
- లీడ్‌రోల్ తీసుకున్న ఎస్సై గంగన్న



సాక్షి, ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసిఫాబాద్ పర్యటన జూన్ 24న అంటూ తొలుత ఖరారైన నాటి నుంచే వసూళ్ల పర్వానికి తెరలేచినట్లు తెలుస్తోంది. సీఎం బందోబస్తు కోసం వచ్చే పోలీసు సిబ్బంది భోజన ఖర్చులను వ్యాపారుల నుంచి వసూలు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించగా ఎస్సై గంగన్న లీడ్‌రోల్ తీసుకున్నారని ఆ స్టేషన్ వర్గాలు చెబుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు స్టేషన్‌లోనే ఈ స్కెచ్‌ప్లేకు రూపకల్పన జరిగినట్లు తెలిసింది. స్టేషన్, డివిజన్ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొనడం విశేషమని ఆ శాఖ సిబ్బందిలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీసు స్టేషన్‌లోనే సమావేశం..

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా జిల్లా పోలీసులకు ఉన్నతాధికారులు కొన్ని బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. బందోబస్తుకు వచ్చే పోలీసులకు వసతి, భోజన ఏర్పాట్లు చేయడం అందులో ప్రధాన విధి. సీఎం పర్యటన తొలుత జూన్ 24న జరగాల్సి ఉండగా.. అది కాస్త జూన్ 30కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలోనే పోలీసు ఉన్నతాధికారులు అప్పగించిన పనిని పూర్తి చేసి, శభాష్ అని పించుకోవాలనే ఉద్దేశంతో ఎస్సై గంగన్న ఒక్కడుగు ముందుకేసి వ్యాపారులను ఏకంగా స్టేషన్‌కే పిలిపించి మాటామంతి జరిపినట్లు సమాచారం. ఎస్సై పిలవగానే వర్తక సంఘాల పెద్దలందరూ జీ హుజూర్ అంటూ రావడం వెనుక కారణం లేకపోలేదన్న వాదనా ఉంది. ఆసిఫాబాద్ పట్టణంలోని ఏ ఒక్క దుకాణ సముదాయానికి పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్లపైనే ఉంచుతున్నారు. ట్రాఫిక్ విధులకు బాస్ అయిన ఎస్సై గంగన్న వాటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తూ.. వ్యాపారులకు సహకరిస్తుండడంతోనే వారు అతను పిలవగానే వచ్చి వాలిపోయారని తెలుస్తోంది.

మాటామంతిలో ఉన్నతాధికారులు..

సాధారణంగా ముఖ్యమంత్రి స్థాయి ప్రజాప్రతినిధి జిల్లా పర్యటనకు వస్తున్నారంటే.. సర్కారు నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందుతాయి. ముఖ్యంగా ఏదైన ఖర్చుతో కూడుకున్నదైతే వెంటనే అందుకు సరిపడా నిధులు సైతం మంజూరవుతాయి. అయితే ఆసిఫాబాద్ పోలీసులు మాత్రం ఇందుకు భిన్నంగా బందోబస్తుకు వచ్చే పోలీసుల భోజన ఖర్చులకు డబ్బులు సమకూర్చాలని వ్యాపారుల ముందు డిమాండ్ ఉంచడం గమనార్హం. ముఖ్యంగా వసూళ్ల బాధ్యతను తన భుజస్కంధాలపై ఎత్తుకొన్న ఎస్సై గంగన్న స్టేషన్‌లోనే వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డివిజన్, సర్కిల్ స్థాయి ఉన్నతాధికారులను సైతం ఆహ్వానించగా.. వారు హాజరై తమదైన సూచనలు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఒక్కో వ్యాపారికి టార్గెట్ నిర్దేశించారు. పోలీసుల వసతి కోసం మొదట స్థానికంగా ఉండే లాడ్జీలన్నింటినీ మూడు రోజుల పాటు ఉచితంగా ఇవ్వాలని షరతు విధించారు. అదే విధంగా ఫంక్షన్ హాళ్లను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. అయితే ఫంక్షన్ హాళ్లలో పనిచేసే లేబర్‌కు, కరెంటు బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడం కొసమెరుపు. భోజనాలు చేసేందుకు వినియోగించే పేపర్ పేట్లు మొదలుకుని.. పప్పు, ఉప్పు.. ఇలా తలా ఒక్కటి ఒక్కో వ్యాపారి సమకూర్చాలని ఆదేశించారు. వీటన్నింటికీ అయ్యే ఖర్చులను వర్తక సంఘాల నేతలు భరించాలనే డిమాండ్ విధించగా.. ఇందుకు కొందరు సమ్మతించినా.. మరికొందరు అంత మొత్తం మేం భరించలేమని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎస్సై గంగన్న మాత్రం తనదైన శైలిలో వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి ఒప్పించి.. రూ.5 లక్షలపైగా డబ్బును సిబ్బంది భోజన ఖర్చులకు వసూలు చేసినట్లు సమాచారం. ఇంత చేసినా బందోబస్తులో ఉన్న సిబ్బంది భోజనాలు రుచికరంగా లేవని విమర్శించినట్లు తెలిసింది. ఆసిఫాబాద్ ఏఆర్ సిబ్బంది అయితే ఏకంగా గొడవకు దిగినట్లు తెలుస్తోంది.

శరవేగంగా మూడో లైన్



మసాలా వాగుపై వంతెన నిర్మాణం



కాగజ్‌నగర్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్

- జిల్లాలో రైల్వే హద్దుల ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- అవసరమున్న చోట వంతెనల నిర్మాణం
- వేగంగా కొనసాగుతున్న పనులు

కాగజ్‌నగర్‌టౌన్: చెన్నై- న్యూఢిల్లీ ప్రధాన రైల్వే లైన్ పరిధిలోని బల్లార్షా- కాజీపేట మార్గంలో మూడో రైల్వే లైన్ పనులు కుమురంభీం జిల్లా పరిధిలో వేగంగా కొనసాగుతున్నాయి. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలకు కీలకమైన ఈ మార్గంలో నిత్యం రైళ్ల రద్దీ అధికంగా ఉంటుంది. ప్రస్తుత ట్రాక్‌లపై భారం తగ్గించేందుకు మంచిర్యాల- బెల్లంపల్లి, రేచినీ రోడ్డు, ఆసిఫాబాద్ రోడ్డు, సిర్పూర్- కాగజ్‌నగర్, సిర్పూర్(టి), మాకోడి, వీరూర్, బల్లార్షా రైల్వే స్టేషన్ల పరిధిలో మూడో రైల్వేలైన్ పనులకు శ్రీకారం చుట్టారు. రైల్వేశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ రైల్వేలైన్ వెంబడి అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో అటవీశాఖ అనుమతులకు కొంత ఆలస్యమైంది. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి బొగ్గు, సిమెంట్, పేపర్ ఉత్పత్తుల రవాణా ఈ మార్గం గుండానే సాగుతోంది. ఈ రైల్వే మార్గంలో మసాలా వాగు, పెద్దవాగుతో పాటు వాగులు, ఒర్రెలపై వంతెనల నిర్మాణాలను ఇంజినీరింగ్ అధికారులు పూర్తి చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు కోసం సైతం ప్రాథమిక స్థాయిలో పిల్లర్ల నిర్మాణం జరుగుతోంది. సిర్పూర్(టి) నుంచి కాగజ్‌నగర్ వరకు (ఈజ్‌గాం రోడ్డు) అధికారులు రైల్వే స్థలం హద్దులు నిర్ధారించి ప్రహరీ సైతం నిర్మించారు. మరో వైపు శివాపూర్‌లో అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

పెద్దవాగుపై వంతెన..

కాగజ్‌నగర్- ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్ల పరిధిలోని ఎల్‌సీ- 75 వద్ద పెద్దవాగుపై రూ.49 కోట్లతో మూడో రైల్వే లైన్‌కు సంబంధించిన బ్రిడ్జితోపాటు నాలుగో లైన్ కోసం వంతెన నిర్మిస్తున్నారు. ఈ పెద్దవాగుపై రెండు వైపులా వరద తాకిడిని తట్టుకునేందుకు రక్షణ గోడలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కాగజ్‌నగర్ మండలం వంజీరి రైల్వే గేట్ వద్ద రూ.6 కోట్ల వ్యయంతో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. మరో 60 రోజుల్లో ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కానుంది. ఈ మార్గంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 55 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ఉంటాయి. మరోవైపు గూడ్స్ రైళ్ల రాకపోకలు సైతం ఉంటాయి. దీంతో తరచూ రైల్వే గేటు పడుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు.

పనులు సకాలంలో పూర్తి చేస్తాం

మంచిర్యాల, బెల్లంపల్లి, రేచినీ రోడ్డు, ఆసిఫాబాద్ రోడ్డు, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), మాకోడి రైల్వే స్టేషన్ల పరిధిలో మూడో రైల్వేలైన్ పనులు సకాలంలో పూర్తి చేస్తాం. కాజీపేట- బల్లార్షా వరకు 226 కిలోమీటర్ల వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణానికి రూ.2,063 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించాం. ఆశించిన స్థాయిలోనే పనులు సాగుతున్నాయి. కల్వర్టులు, వంతెనలు, ట్రాక్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాయి.

– శ్రీనివాస్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: అధికారులు, రాజకీయ పార్టీ ఏజెంట్లు సమన్వయంతో పనిచేస్తూ స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశం, డీఆర్వో రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రానికి మార్చుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, రెండు కార్డులు కలిగిన వారి వివరాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 1,300 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రానికి అదనంగా కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. జాబితాలో తప్పులుంటే సవరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల డీటీ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న రాజీవ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకుడు రాజీవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం డీఈవో అశోక్‌తో కలిసి ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డాటా ఎంట్రీ, ఎంఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్పీల నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాల నమోదు ప్రక్రియను పూర్తి చేసి, జిల్లా కార్యాలయంలో అందించాలని ఆదేశించారు.

పనులు సకాలంలో పూర్తిచేయాలి

మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు సకాలంలో పూర్తిగా చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సంయుక్త సంచాలకులు రాజీవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, చిర్రకుంట ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన 'మన ఊరు- మన బడి' పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు సత్తయ్య, భరత్, సుభాష్, అబిద్ అలీ, ఉదయ్‌బాబు తదితరులు ఉన్నారు.

గిరి గోస తీరేనా?



ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యల తిష్ట
- మౌలిక వసతులకూ నోచుకోని అడవిబిడ్డలు
- కొత్త పీవోపైనే గంపెడాశలు
- 'చాహత్'కు సవాలుగా గిరిజనం అవస్థలు



ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం

కైలాస్‌నగర్: గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించాల్సిన గురుతర బాధ్యత ఐటీడీఏదే. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ కేంద్రంగా ఇది పనిచేస్తోంది. కీలకమైన ఈ ఐటీడీఏకు 61వ ప్రాజెక్ట్ అధికారి(పీవో)గా చాహత్ బాజ్‌పాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే నాలుగు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల సమస్యలు ఆమెకు స్వాగతం పలుకుతున్నాయి. నిజాయతీ, ముక్కుసూటిగా విధులు నిర్వహిస్తారనే పేరు పొందిన ఆమెపై గిరిజనం గంపెడాశలు పెట్టుకున్నారు. తన ముందున్న సమస్యలను ఏ విధంగా అధిగమించి గిరిపుత్రులకు అండగా నిలుస్తారనే దానిపై చర్చ సాగుతోంది. కొత్త పీవోకు సవాలుగా మారనున్న ఉమ్మడి జిల్లాలోని సమస్యలను ఓ సారి పరిశీలిస్తే..

తాగునీటికీ.. తంటాలె

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి శుద్ధజలం అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అనేక గూడెలు, తండాలకు ఇప్పటికి తాగునీరు అందడం లేదు. ఇప్పటికీ చాలాచోట్ల బావులు, చెలిమల నీరే దిక్కవుతోంది. ముఖ్యంగా వేసవి, వర్షాకాలంలో తాగునీరు అందక గిరిజనుల అవస్థలు వర్ణనాతీతమే.

రోడ్డు సౌకర్యం లేని గ్రామాలెన్నో..

ఉమ్మడి జిల్లాలోని అనేక గిరిజన గూడేలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులకు కాలినడకే దిక్కవుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం రాని దుస్థితి. దీంతో సకాలంలో వైద్యం అందని పరిస్థితి. అలాగే రేషన్ సరుకులు, ఇంటికి అవసరమైన వస్తువులను నెత్తిపైన పెట్టుకొని తీసుకెళ్లడంలో గిరిపుత్రుల అవస్థలు అన్నీ ఇన్ని కావు.

పోడు... గోడు తీరేనా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులను ఏళ్లుగా పోడు సమస్య వేధిస్తోంది. ప్రభుత్వం తాజాగా ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద పట్టాలు జారీ చేస్తున్నప్పటికీ దరఖాస్తుదారుల సంఖ్యకనుగుణంగా అవి ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఏళ్లుగా భూములను సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు అందని గిరిజనులు మళ్లీ ఆందోళన బాట పట్టే ప్రమాదం లేకపోలేదు. సోమవారం కలెక్టరేట్, ఐటీడీఏలో నిర్వహించిన ప్రజావాణిలో దీనిపై పదుల సంఖ్యలో గిరిజన, గిరిజనేతరులు వినతిపత్రాలు అందజేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

వేధిస్తున్న రక్తహీనత

ఆదివాసీ మహిళలు, యువతులను రక్తహీనత సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా ప్రసవం కోసం రిమ్స్‌ను సందర్శించే వారిలో అధికశాతం మంది ఈ సమస్యతోనే బాధపడుతుండడం గమనార్హం. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, అవగాహన లేకపోవడం సమస్యకు కారణంగా నిలుస్తోంది. సకాలంలో రక్తం అందక ప్రసవానికి వచ్చిన గర్భిణి బిడ్డతో సహా మరణించిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇలాంటి దుస్థితిని దూరం చేసి వారికి పౌష్టికాహారం అందించేలా చూడాల్సిన అవసరం ఉంది. చాలామంది మహిళలు ఇప్పటికీ సకాలంలో ఏఎన్‌సీ పరీక్షలు చేసుకోకపోవడం, కొన్ని గూడేల్లో ఇంకా ఇంటి వద్దే డెలివరీలు జరుగుతుండటంతో మాతా శిశు మరణాలు ఆగని పరిస్థితి. ఫలితంగా మాతృత్వం అనుభవించేలోపే మహిళలు మృత్యుఒడికి చేరాల్సి వస్తోంది.



నార్నూర్ మండలం నన్నూగూడ గ్రామానికి చెందిన గర్భిణిని వాగు దాటించి ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకెళ్తున్న ఆశాకార్యకర్త (ఫైల్)

విద్య, వైద్యానికి తప్పని తిప్పలు

మనిషి సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నా, ఆరోగ్యంగా జీవించాలన్నా విద్య, వైద్యం ఎంతో కీలకం. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇవి ఏళ్లుగా అందని దుస్థితి. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటికీ సరైన వసతుల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ చాలా పాఠశాలల్లో అమలుకు నోచుకోని పరిస్థితి. దీంతో విద్యార్థులు అర్ధాకలితో చదువుకోవాల్సి వస్తోంది. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పలు చోట్ల తమకు బదులుగా ఇంటర్మీడియెట్, పదో తరగతి చదువుకున్న వారిని నియమించుకుని విధులకు ఎగనామం పెడుతుండడం గమనార్హం. అధికారుల పర్యవేక్షణ తీరుకు నిదర్శనమిది.

వైద్యం విషయానికి వస్తే వర్షాకాలం వచ్చిందంటే చాలు అనేక గ్రామాల్లోని వాగులపై వంతెనలు లేక రోడ్లు తెగిపోయి బాహ్య ప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోయే పరిస్థితి. ఇలాంటి గ్రామాల్లో అత్యవసరమైన పరిస్థితి ఏర్పడితే ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతుంది. వర్షాకాలంలో అంటు వ్యాధుల సంగతి సరేసరి. పారిశుధ్యం, తాగునీరు సక్రమంగా అందక ఏటా సీజనల్ వ్యాధులు ప్రబలి గిరిజనం మంచాన పడడం షరా మామూలే. సకాలంలో వైద్యం అందక మృత్యుఒడిని చేరిన పరిస్థితులూ లేకపోలేదు.

సీఎం చొరవతో నెరవేరిన గిరిజనుల కల

- మంత్రి ఐకే రెడ్డి
- ఉట్నూర్‌లో లబ్ధిదారులకు పోడు పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి ఐకే రెడ్డి

ఉట్నూర్‌రూరల్: పోడు పట్టాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల కల సీఎం కేసీఆర్ చొరవతో నెరవేరిందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఉట్నూర్ వేదికగా మంగళవారం నిర్వహించిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం సంబురంగా సాగింది. కుమురంభీం ప్రాంగణంలో ఖానాపూర్, ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలోని ఏజెన్సీ మండలాల గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రేఖానాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ఐకే రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేబీ ప్రాంగణంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కుమురంభీం స్ఫూర్తితో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని 1.52 లక్షల మంది గిరిజనులకు పోడు హక్కు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమానికి గత నెల 30న ఆసిఫాబాద్‌లో శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల 8వరకు లబ్ధిదారులందరికీ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 12,222 కుటుంబాలకు 31,683 ఎకరాలు, కుమురంభీం జిల్లాలో 15,254 కుటుంబాలకు 44,750ఎకరాలు, మంచిర్యాల జిల్లాలో 2,403 కుటుంబాలకు 5,024 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 7,253 కుటుంబాలకు 20,051 ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరికీ రైతుబంధు సైతం అందించనున్నట్లు చెప్పారు. గిరి వికాసం పథకం ద్వారా త్రీఫేజ్ కరెంట్, బోరు మోటార్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

అడవులను నరకవద్దు..

అర్హులందరికీ పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని, ఇక మీదట ఎవరూ అడవులను నరకవద్దని మంత్రి అన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా పది మందికి పట్టాలు అందజేశారు. మిగతా వారికి ప్రాంగణం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, ఆత్రం సక్కు, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, ఎస్సీ రెడ్డితో పాటు మాజీ ఎంపీ గోడం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా విక్రేతలతో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెట్‌పల్లిలో మంగళవారం ఎక్సైజ్, పోలీసులు దాడులు నిర్వహించారు. తమకు అందిన సమాచారం మేరకు కన్నెపల్లి ఎస్సై నరేష్, ఎక్సైజ్ ఎస్సై నిర్మల సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన దుమ్మ భాగ్యలక్ష్మి, ఎల్లా శేఖర్, బొక్కలాల శేఖర్, కడాల సుధాకర్ వద్ద నుంచి ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, పట్టుకున్న గుడుంబాను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు కన్నెపల్లి ఎస్సై నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎక్సైజ్ ఎస్సై నిర్మల పేర్కొన్నారు.

హత్య కేసులో తల్లీకూతుళ్ల రిమాండ్

దహెగాం: హత్య కేసులో తల్లీకూతుళ్లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన వెల్ములే పుల్లయ్యను అతని భార్య మంగ, కూతురు తేజరాణి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. పుల్లయ్య తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడని, ఈ నెల 1న మధ్యాహ్నం మద్యం సేవించి ఇంట్లో గొడవ పడడంతో భార్య, కూతురు కలిసి హత్య చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని సోదరుడు హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ చేపట్టి తల్లీకూతుళ్లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



మల్లేశ్ మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవేగాం గ్రామానికి చెందిన బోయిని మల్లేశ్ (35) రోజు మాదిరిగానే మంగళవారం గొర్రెలను మేపేందుకు కొండపల్లి పరిసరాలకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

బడికి నిధులు..!

- నిర్వహణ కోసం మొదటి విడత విడుదల
- ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున కేటాయింపు
- క్రీడా నిధులు సైతం మంజూరు



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

మంచిర్యాలఅర్బన్:సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం సుద్దముక్క (చాక్‌పీస్) కొనుగోలుకు కూడా పైసలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలలను నిధుల కొరత వేధిస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లోనైనా నిధులు సకాలంలో విడుదలవుతాయని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులు వెచ్చించారు. ఎట్టికేలకు ఈ విద్యాసంవత్సరం 2023–24లో పాఠశాల శుభ్రత, ఇతర నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులను ఈ నెల 3న విడుదల చేసింది. ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్యను బట్టి తొలి విడతగా 50 శాతం నిధులు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి బడి నిర్వహణ నిధులు మంజూరు చేస్తోంది. రెండు విడతల్లో నిధులు కేటాయిస్తారు. సుద్దముక్కలు (చాక్‌పీస్)లు, తరగతి గదులు శుభ్రం చేసే చీపుర్లు, రిజిస్టర్లు, ఇతర ఖర్చుల కింద నిధులు వినియోగిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయించారు. 1 నుంచి 30 మంది విద్యార్థులకు రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25 వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మందికి రూ.75వేలు, వెయ్యికి పైగా విద్యార్థులకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

క్రీడా నిధులొచ్చాయ్..

స్కూల్ గ్రాంటు నిధులతో పాటు ప్రభుత్వం స్పోర్ట్స్ గ్రాంటు నిధులు కూడా విడుదల చేయడం క్రీడాకారులకు ఉపశమనం కలిగిస్తోంది. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంటు యుటిలైజేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 8వ తరగతి, 9 నుంచి 12వ తరగతికి సమగ్ర శిక్ష కింద ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌ల కోసం క్రీడా పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, సాఫ్ట్‌బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బీన్‌బ్యాగ్స్, సాకర్‌కోన్, షాట్‌ఫుల్, డిస్కస్, ఫోమ్ జావెలిన్ తదితర పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రీడా పరికరాలతో పాటు అదనంగా స్కిప్పింగ్ రోల్, వాలీబాల్, త్రోబాల్, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా నిధులు మొదటి విడతలో 50 శాతం మంజూరయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో స్పోర్ట్స్ నిధులు

జిల్లా	స్కూల్స్	మొత్తం నిధులు	మొదటిదఫా మంజూరు
ఆదిలాబాద్	1,098	రూ.65,30,000	రూ.32,65,000
కుమురంభీం	937	రూ.54,30,000	రూ. 27,15,000
నిర్మల్	719	రూ.45,50,000	రూ.22,75,000
మంచిర్యాల	720	రూ.45,60,000	రూ.22,80,000

స్కూల్ గ్రాంటు నిధులు

జిల్లా	స్కూల్స్	మొత్తం నిధులు	మొదటిదఫా మంజూరు
మంచిర్యాల	720	రూ.1,51,70,000	రూ.75,85,000
ఆదిలాబాద్	1,098	రూ.2,31,45,000	రూ.1,15,72,500
కుమురంభీం	937	రూ.1,81,40,000	రూ.90,70,000
నిర్మల్	719	రూ.1,79,50,000	రూ.89,75,000

కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏరియర్స్ ఎప్పుడు చెల్లిస్తారో ముఖ్యమంత్రి తేదీని ప్రకటించాలన్నారు. జాతీయ సంఘాల సమష్టి కృషి, కార్మికుల ఐక్యతతోనే 11వ వేతన ఒప్పందం మెరుగ్గా జరిగిందన్నారు. ఏ పరిశ్రమల్లో లేని విధంగా బొగ్గు గని కార్మికులకు వేతనాలు పెరిగాయన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని సంఘాలను సమానంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై జరిగే స్ట్రక్చర్ సమావేశాలు, మైన్స్, సేఫ్టీ కమిటీలలో అన్ని సంఘాల నేతలను ఆహ్వానించాలన్నారు. మహిళా కార్మికులను భూగర్భంలో దించే విధంగా కంపెనీ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రెటరీ రంగొట్టి శ్రీనివాస్, నాయకులు నంబయ్య, మల్లేశ్, బాలయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని యాజమాన్యం స్పందించని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు పూనుకోవాలని ఏరియా కమిటీ తీర్మానించింది. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లపై రక్షిత మంచినీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ మజ్దూర్, ఎలక్ట్రీషియన్ల కొరత ఉందన్నారు. సమస్యలపై యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు మంగీలాల్, రాయలింగు, నర్సయ్య, చంద్రశేఖర్, రవీందర్, సమ్మయ్య, రాజేశం, సంపత్, పాల్గొన్నారు.

ఎస్వోటూ జీఎంను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

బెల్లంపల్లి ఏరియా నూతన ఎస్వోటూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌ను మంగళవారం ఏరియా టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భూవివాదంలో ఒకరు ఆత్మహత్యాయత్నం

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని చామనపల్లిలో రెండు రోజులుగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంటోంది. ఇరువర్గాలకు జరుగుతున్న భూవివాదంలో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. చామనపల్లి వాగు నుంచి గ్రామ పొలిమేరలో కుశ్నపల్లి రోడ్డు వరకు వందలాది ఎకరాల వివాదాస్పద భూమి ఉంది. ఇది చెన్నూర్ రిజర్వు కంపార్ట్‌మెంట్ 124, 125కు వస్తుందని అటవీ అధికారులు తెలుపుతుండగా రెవెన్యూ రికార్డుకు 65, 67 సర్వే నంబర్లుగా ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది చెప్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాస్పద భూమిలో సుమారు 140 మందికి భూపంపిణీ కింద పట్టాలు ఇచ్చింది. కానీ కొందరికి తమభూమి ఎక్కడుందో ఇప్పటికీ తెలియదు. కొంతమంది మాత్రం 20 ఏళ్లుగా సాగు చేసుకుంటూనే ఉన్నారు. గ్రామానికి చెందిన నూకల చిన్న పర్వతాలు తాను సాగు చేసుకుంటున్న భూమిలో పది రోజుల క్రితం పత్తి విత్తనాలు విత్తాడు. దీంతో కొందరు ఆ భూమి తమదంటూ మొలకెత్తిన పత్తి మొక్కలను పీకేశారు. అదిచూసి తట్టుకోలేని పర్వతాలు మంగళవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతని భార్య పద్మ మందు డబ్బాను లాక్కోవడంతో ప్రాణా పాయం తప్పింది. బాధితుడు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై సుబ్బారావు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అటవీ అధికారులు ఒక వర్గంతో కుమ్మక్కై వారి వద్ద డబ్బులు తీసుకుని దగ్గరుండి మొక్కలు పీకించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. అధికారులు క్షేత్ర స్థాయిలో జాయింట్ సర్వే చేసి పట్టాలు ఉన్నవారికి భూమిని చూపించి ఎలాంటి గొడవలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

35శాతం లాభాల వాటా చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాల్లోంచి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్కే 7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందంలో బీఎంఎస్ కృషి ఫలితంగానే వేతనాలు పెరిగాయన్నారు. తమ యూనియన్ వేజ్ బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి వేతన ఒప్పందం కోసం కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తేవడం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రితో సంప్రదింపులు జరపడం వల్లే నూతన ఒప్పందం త్వరితగతిన జరిగిందన్నారు. మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతం, 25 శాతం అలవెన్సులు పెరిగాయన్నారు. ఇది చరిత్రాత్మక ఒప్పందం అన్నారు. సింగరేణిలో ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాంపల్లి తిరుపతి, మహేందర్ వర్మ, బుర్ర అరుణ్ గౌడ్, మంద కమలాకర్, సంపత్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ నా గ రాజు తెలిపిన వి వరాల ప్రకారం మండలంలోని కో సిని గ్రామ పంచాయతీలోని రాంనగర్‌కు చెందిన సిగ కొమురమ్మ (70)మంగళవారం కిరా ణా దుకాణానికి వెళ్తుండగా బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన అబ్దుల్ ముజాహిద్ ఢీకొ ట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డి మాండ్ చేస్తూ గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి కుమారుడు రాజ్‌కుమా ర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సోనియా తెలిపారు.

భూతగాదాలో ఒకరు ఆత్మహత్యాయత్నం

తాండూర్(బెల్లంపల్లి): వారసత్వంగా వచ్చిన భూమిని సమానంగా పంపకం చేయలేదని ఆరోపిస్తూ ఒకరు మంగళవారం గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇడిదినేని వెంకటేశ్, లచ్చయ్య, రామయ్య ముగ్గురు అన్నదమ్ములు. వారసత్వంగా వచ్చిన భూమిని అందరికీ సమానంగా పంచలేదని వెంకటేశ్ కొంతకాలంగా అభ్యంతరం తెలుపుతున్నాడు. ఈ క్రమంలో లచ్చయ్య తన వాటా కింద వచ్చిన భూమిని అమ్మకానికి పెట్టాడు. ఈ క్రమంలో భూపంపకం చేయాలని వెంకటేశ్ పట్టుబట్టాడు. ఇందుకు లచ్చ య్య ని రాకరించడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఫి ర్యాదు చేసి కోర్టులో కేసు కూడా వేశాడు. అయినా వి క్రయించేందుకు సిద్ధపడడంతో మనస్తాపం చెందిన వెంకటేశ్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తనచావుకు సోదరుడు లచ్చయ్య, సిద్దం శంకర్, ఒడ్నాల బాపు కారణమని లేఖ రాసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి

కాగజ్‌నగర్‌టౌన్: కూలర్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఆదర్శ్‌నగర్ కాలనీకి చెందిన తన్నీరు సుశీల (68) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. సోమవారం రాత్రి కూలర్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. ఈక్రమంలో ఆమెపై కూలర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం ఉదయం బంధువులు వచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

మందమర్రికి చేరిన పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న బాబురావు, శోభ

మందమర్రిరూరల్: రాష్ట్రంలో, దేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని, కేసీఆర్ ప్రధాన మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజురాకు చెందిన ముస్కే బాబురావు, శోభ దంపతులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. నల్లని దుస్తులు ధరించి చేతి, మెడకు బేడీలు వేసుకుని కేసీఆర్ చిత్రపటంతో కూడిన బ్యానర్ చేతపట్టుకుని పాదయాత్ర చేపట్టారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని, కేసీఆర్ ప్రధాని అయితే దేశవ్యాప్తంగా పథకాలు అమలవుతాయని వారు పేర్కొన్నారు. అనంతరం అందుగులపేట, పులిమడుగు మీదుగా మంచిర్యాలకు వెళ్లారు.

పలువురి బైండోవర్



బైండోవర్ అయిన యువకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రిపూట బయట తిరుగుతూ గొడవలకు పాల్పడుతున్న పలువురు యువకులను మంగళవారం బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న మధుకర్, రాజ్‌కుమార్, అజయ్, సందీప్, శేఖర్, కుమార్, ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో చంద్రవెల్లి యువకుడు

బెల్లంపల్లిరూరల్: ఆన్‌లైన్‌లో మోసానికి ఓ యువకుడు బలై డబ్బులు పోగొట్టుకున్నట్లు తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న తెలిపారు. మండలంలోని చంద్రవెల్లికి చెందిన బూర శివ మొబైల్‌కు గత నెల 8 న 84588771421 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. ఆ నంబర్‌తో చాట్ కొనసాగించగా ఒక కోడ్ పంపి దానిని వాల్లిస్ అనే టెలిగ్రామ్ అకౌంట్‌కు పంపిస్తే రూ.50 చెల్లిస్తామని చెప్పడంతో అలాగే చేశాడు. దీంతో వారు రూ.50 శివ అకౌంట్‌కు పంపించారు. 12న మేసేజ్ పంపడంతో రూ.వెయ్యి పంపించాడు. బదులుగా రూ.1300 అకౌంట్‌లో జమ చేశారు. మరుసటి రోజు రూ.6వేలు పంపించగా బదులుగా రూ.7,800 జమ చేశారు. 13న రూ.25 వేలు పంపించమనడంతో ఆ నగదును వారి అకౌంట్‌కు పంపించాడు. మూడు నాలుగు రోజులు గడిచినా నగదు రాకపోవడంతో మోసపోయానని గుర్తించి వెంటనే 1930 నంబర్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు ఆ నగదును ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజన్న తెలిపారు.

బోదకాలు నివారణపై అవగాహన

నస్పూర్: బోదకాలు, నులిపురుగుల నివారణపై మంగళవారం జిల్లా వైద్యాధికారులు పట్టణంలోని కేజీబీవీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అనిత, నస్పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమత, ఎస్‌వో మౌనిక, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అద్దెవాహన యజమానులతో చర్చలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి అద్దె వాహనాల నిర్వహణ సమస్యలపై బెల్లంపల్లి ఏరియాకు చెందిన వాహన యజమానులు సమ్మె నోటీసు అందించిన నేపథ్యంలో మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్ వాహనాల యజమానులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వాహన యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా తమవంతు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం నరేందర్, డీజీఎం రామారావు, ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, ఈఈ పర్చేస్ రవి, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల ధర్నా

మంచిర్యాలఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూని యన్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు పద్మ, అంజలి, లక్ష్మి, గట్ట మ్మ, పోసక్క, భాగ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భీమారం: హరితహారాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీవో దత్తారావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించగా దత్తారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో ఉపాధిహామీ కింద చేపట్టనున్న హరితహారం కోసం వెంటనే మొక్కలు పంపిణీ చేయాలని, గ్రామగ్రామాన ఇంటికి ఆరు మొక్కల చొప్పున అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసులు తొలగేనా?

- పోడుభూముల కేసులు ఎత్తివేస్తామన్న సీఎం కేసీఆర్
- కోయపోచగూడ గిరిజనులకు అవకాశం దక్కేనా?



భూపోరాటం సమయంలో గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): దండేపల్లి మండలం మాకులపేట పంచాయతీ పరిధిలోని కోయపోచగూడ ఆదివాసీ గిరిజనులు పోడుభూముల కోసం పోరాటాలు చేశారు. అటవీ భూముల్లో చెట్ల పొదలు నరికి నిప్పుపెట్టారు. వారి పోరాటాలను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలించారు. దీంతో గూడేనికి చెందిన సుమారు 12 మంది మహిళలు, 8మంది పురుషులపై గతంలో (2022లో) కేసులు నమోదయ్యాయి. అందులో మహిళలను అరెస్టు చేసి జైలుకు తరలించడం రాష్ట్రంలో అప్పట్లో చర్చనీయాంశమైంది.

గిరిజనులపై కేసులు తొలగేనా?

ఇటీవల సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. పోడు విషయంలో నమోదైన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రకటనతో తమపై నమోదైన కేసులు ఇక తొలగిపోతాయని, కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని గిరిజనులు ఆశతో ఉన్నారు. అటవీ భూములను ఆక్రమించుకునే క్రమంలో నమోదైన కేసులు ఎత్తివేయక పోవచ్చన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పోడుకేసుల ఎత్తివేతపై ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడాల్సిందే మరి.

మార్గదర్శకాలు వస్తేనే..

పోడు కేసులు ఎత్తివేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ కేసులు అనేవి కోర్టు పరిధిలోనివి. కేసుల ఎత్తివేత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. అందుకు తగ్గ మార్గదర్శకాలు విడుదల చేస్తే తప్పా ఏంచెప్పలేం. ఏదైనా ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలపైనే ఆధారపడి ఉంటుంది.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

చంటిపాపను వదిలి జైలుకు..



భూపోరాటంలో భాగంగా నాపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. చంటిపాపను వదిలి వారం రోజుల పాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటికి వచ్చా. ఇప్పటికీ కోర్టుకు హాజరవుతున్నా. పోడు కేసులు ఎత్తివేస్తామని కేసీఆర్ సారు చెప్పిండ్రు. అది మాకు కూడా వర్తింపచేసేలా చూడాలి.

– దోసండ్ల సునీత, కోయపోచగూడ

హక్కుపత్రాలు ఇవ్వాలి



గిరిజనులందరం కలిసి సమీప అటవీ భూమిలో సాగు చేసేందుకు యత్నిస్తే అధికారులు అడ్డుకుని కేసులు పెట్టి జైలుకు తరలించారు. ప్రభుత్వం కోయపోచగూడ గిరిజనుల గోడును గుర్తించి, పోడు భూములకు పట్టాలు ఇచ్చినట్టుగానే, మాకు హక్కు పత్రాలిచ్చి ఆదుకోవాలి. మాపై పెట్టిన కేసులు ఎత్తేయాలి.

– మద్దికుంట రమేశ్, కోయపోచగూడ